క్లుప్తంగా

కనీస వేతనాలు ఇవ్వాలి



లక్ష్మీపురం: వసంత రాయపురం మలేరియా డివిజన్ వద్ద ఏఐటీయూసీ పతాకాన్ని మాల్యాద్రి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయల దగ్గర ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు నగరంలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిత్యావసరాలు ఆమాంతం పెరగడం వల్ల కార్మికుడి చాలి చాలని జీతాల వలన ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, దిలీప్, కిరణ్, వెంకటేశ్వర్లు, కిషోర్, ఏడుకొండలు శ్రావణ్, బాలరా జు, శంకర్, సాంబయ్య పాల్గొన్నారు.

కాలి నడకతో పుణ్యక్షేత్రాలు సందర్శించిన దంపతులకు సత్కారం

నగరంపాలెం: ఇటీవల తెనాలి వాసి డాక్టర్ హనుమంతరావు(ఆయుర్వేదిక్), భార్య నగరాజకుమారి తెనాలి నుంచి ప్రయాగ, కాశీకి 70 రోజులు కాలి నడకతో పుణ్య క్షేత్రాలు సందర్శించారు. శనివారం జిన్నాటవర్ కూడలిలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో గౌరవ శాశ్వత అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షులు యేల్చూరి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు టి.విజయశ్రీ, ఉపాధ్యక్షులు టీఎల్‌వీ.వీరాంజనేయులు, ఆతుకూరి నగేష్‌కుమార్, వీవీ.నాగిరెడ్డి, బూర్లె రామసుబ్బారావు, కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్రకచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజస్వామి కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శనివారం శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. తొలుత పీఎల్ జయంతి, డాక్టర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. స్థానిక కళాకారులు శ్రీత్యాగరాజ విరిచిత పంచరత్న కీర్తనలను గోష్ఠి గానం నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు బి.ప్రహ్లాద తమ గాత్రధారణలో పలు వురు వాగ్గేయకారుల కీర్తనలు ఆలపించారు. వయోలిన్‌పై ఎ.కామాక్షి, పీఎల్ జయంతి, మృదంగంపై కుందుర్తి అరవింద, ఏహెచ్ సూర్య వాయిద్యాన్ని అందించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవై.శేషు రాణి పాల్గొన్నారు.

రేపు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

లక్ష్మీపురం: దేశంలో అసంఘటిత, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు డిమాండ్ చేశారు. శనివారం గుంటూరు ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోటా మాల్యాద్రి పాల్గొన్నారు.

రాహుల్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

లక్ష్మీపురం: కులగణన సాధనలో రాహుల్ గాంధీ కీలక పాత్ర అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ్యుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. శనివారం కులగణన సాధించిన రాహుల్ గాంధీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రత్తయ్య, బీసీ నాయకులు రామకృష్ణ, విజయ్ గౌడ్, ఖలీల్, కరీమా, హద్దు, జానీ, ఇస్మాయిల్, మోషే, బుజ్జి పాల్గొన్నారు.

శిశు గృహానికి ఏసీల వితరణ



గుంటూరు మెడికల్: గుంటూరులోని మహిళ ప్రాంగణంలోని ప్రత్యేక దత్తత గృహ సంస్థ (శిశు గృహం)కు ఆర్కా –11 క్రికెట్ ఫౌండేషన్ గుంటూరు మిత్ర బృందం పి.నాగార్జున, కె.గిరి ఆధ్వర్యంలో శనివారం ఏసీలు వితరణగా అందజేశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు చేతుల మీదుగా శిశు గృహ సంస్థ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీకాంత్, జశ్వంత్, ఫణీంద్ర, బ్రహ్మేంద్ర, ప్రవీణ్, అనిల్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

కల్యాణానికి వేళాయె..

- మే నెలలో పెళ్లిళ్ల సందడి
- నగరంలో మండపాలకు పెరిగిన డిమాండ్
- ఊపందుకున్న వస్త్ర, బంగారు విక్రయాలు
- ఈవెంట్ నిర్వాహకులు బిజీ



నగరంలో ముస్తాబైన కల్యాణమండపాలు

నెహ్రూనగర్: మంచి రోజులు వచ్చాయి. వేసవి అంటే సాధారణంగా పెళ్లి సీజన్‌గా ప్రసిద్ధి. తెలుగింట పెళ్లిబాజా మోగింది. మే నెలలో మంచి ముహూర్తాలు ఉండటంతో మంచి ఘడియాలు చూసి లగ్నం నిర్ణయిస్తున్నారు. గతంలో పెళ్లి సందడి వేరుగా ఉండేది. పచ్చని పందిళ్లు. ఊరంతా తోరణాలు. ఐదారు రోజులు ఇంట్లో సందడి నడిచేది. ఇప్పుడు నయా ట్రెండ్ నడుస్తోంది. పెళ్లంటే వెడ్డింగ్ షూట్లు, కల్చరల్ ప్రోగ్రాములతో కొత్తరూపం వచ్చింది.

పండుగ లాంటిది...

ఆ పండుగ చేసుకునే విధానాల్లో ఎన్ని కొత్త పోకడలు వచ్చినా ఆచార సంప్రదాయాలు మాత్రం మారలేదు. పెళ్లిలో తప్ప కుండా బాజాభజంత్రీలు, మాంగల్యధారణ, తలంబ్రాలతో కుటుంబ సభ్యులు బంధు మిత్రుల మధ్య ఆనందంగా జరుపుకొంటున్నారు. ఆధునిక కాలంలో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం పెళ్లిలోనూ చోటు సంపాదించుకుంది. డ్రోన్ కెమెరా షూటింగ్, ఫొటోగ్రఫీ, ప్రీ వెడ్డింగ్ షూట్, వెడ్డింగ్ షూట్, ఏసీ ఫంక్షన్ హాల్, విద్యుత్ సెట్టింగులు, భారీ డెకరేషన్లు ఈ రోజుల్లో పెళ్లిలో కనిపిస్తున్నాయి.

పెరిగిన ఖర్చులు

నగరంలో పెళ్లిళ్ల సీజన్ మొదలు కాగానే వస్త్ర దుకాణాలు, పెళ్లి మండపాలు, డెకరేషన్ సామగ్రి, బాజాభజంత్రీలు, సెట్టింగ్‌కు సంబంధించి వాటి ధరలు భారీగా పెరిగాయి. దాంతో ఆయా రంగాల మేనేజర్లకు, కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. వేసవి కావడంతో పాటు ఇటీవల పెళ్లిళ్లకు ఏసీ కల్యాణ మండపాలను బుక్ చేసుకుంటున్నారు. అన్నీ ఒకే చోట దొరుకుతుండడంతో ఏ ఇబ్బందీ ఉండదని భావిస్తున్నారు. దానికి తోడు ఏసీ కల్యాణ మండపాల్లో భారీ సెట్టింగులతో వివాహాలు చేస్తే తమ హోదాను కూడా చాటుకోవచ్చని భావిస్తున్నారు. పూల మండపాలను మిరమిట్లు గొలిపే విద్యుత్ దీపాల సెట్టింగులు, బెలూన్లతో డిజైన్లు వేసి సిద్ధం చేస్తున్నారు. దీనికి సుమారు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వ్యయం అవుతోంది. గతంలో నగరాల్లో ఉండే ఈ హడావుడి ప్రస్తుతం పల్లెలకు పాకడంతో వివాహ ఖర్చులు పెరిగిపోయాయి. ఒక్కొక్క వివాహానికి క్లాత్ డిజైన్ సెట్టింగులు రూ.25 వేల నుంచి రూ.లక్షకుపైగా ఖర్చు చేస్తున్నారు. పూల మండపానికి రూ.25 వేల నుంచి రూ.1,75,000 కూడా వ్యయం అవుతోంది. ఎల్ ఈడీ స్క్రీన్లు, లేజర్ స్క్రీన్లు ఏర్పాటు చేస్తే మరింత ఖర్చు పెడుతున్నారు. ఆర్థిక స్తోమతను బట్టి వారు ఉన్నంతలో వివాహాలను ఘనంగా జరిపించేందుకు సిద్ధమవుతున్నారు.

ముహూర్తాలు ఇవే..

2, 3, 5, 6, 8, 15, 17, 18, 22, 24, 27, 28వ తేదీలు మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. గుంటూరు నగరంతో పాటు పక్కన విలీన గ్రామాల్లో కూడా వివాహ మహోత్సవాలు వేల సంఖ్యలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అంతా క్యాటరింగ్ మయం

గతంలో ఒక వివాహం జరిగితే బంధువులు, తెలిసిన వాళ్లు వచ్చి పిండి వంటలు, భోజనాలను అవసరమైన వంటలు వండటంతోపాటు వడ్డించే వారు. ఇప్పుడు ఆ సంప్రదాయం పోయింది. అంతా క్యాటరింగ్ మయమైంది. ఆర్డర్ ఇస్తే చాలు క్యాటరింగ్ వారే భోజనాలు సహా అన్నీ వడ్డిస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం బంధువుల్లో వంటావార్పు చేసేవారు తగ్గడం తో క్యాటరింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. వీరు ఒక్కో వేడుకకు మెనూ బట్టి ధరను నిర్ణయిస్తున్నారు. వివాహ ముహూర్తాలు ఒకే నెలలో ఎక్కువ ఉండటంతో వస్త్ర, నగల వ్యాపారాలు కూడా ఊపందుకుంటున్నాయి.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు అజయ్‌కుమార్

లక్ష్మీపురం: మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రముఖ సీనియర్ హైకోర్టు న్యాయవాది వైకే అధ్యక్షత వహించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ మధ్య భారతంలో ఆదివాసులపై మారణకాండను నిలిపివేయాలని కోరారు. కర్రెగుట్టలపై సైనిక చర్యలు ఆపి, క్యాంపులు నిలిపివేయాలని కోరారు. దండకారణ్యంలో ఆపరేషన్ కగార్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఇది ముమ్మాటికీ రాజ్యాంగ హక్కులపై దాడి అని, ఈ దాడిని వామపక్షాలు, ప్రజాసంఘాలుగా తీవ్రంగా ఖండిస్తున్నామని వివరించారు.

రైలు ప్రయాణికులకు తాగునీటి బాటిళ్లు పంపిణీ



లక్ష్మీపురం: గుంటూరు డివిజన్‌ని రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటిని బోగిల వద్దకు స్వయంగా వెళ్లి తాగునీటిని అందజేయడం జరిగిందని గుంటూరు రైల్వే డివిజన్ డీసీఎం కమలాకర్ బాబు తెలిపారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వే స్టేషన్‌లలో డీఆర్‌ఎం సుధేష్ట సేన్ ఆదేశాల మేరకు రైలులో ప్రయాణించే సాధారణ ప్రయాణికులకు తాగునీటి వసతిని కల్పించే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు వేసవిలో రైల్వే స్టేషన్‌లలో తాగునీటి కొరత లేకుండా ఉండటం కోసం ప్రతి రైల్వే స్టేషన్‌లలో ప్లాట్‌ఫారాలపై, రైళ్లలో చల్లని తాగునీటిని అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందన్నారు. గుంటూరు నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపురం, కంభం, గిద్దలూరు, నంద్యాల, నల్గొండ రైల్వే స్టేషన్‌లలో ప్రయాణికులు తాగునీటి బాటిల్స్‌ను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. గుంటూరు, నరసరావుపేట రైల్వే స్టేషన్‌లలో ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, వలంటీర్ల ద్వారా పంపిణీ చేయించినట్లు చెప్పారు.

రేపటి నుంచి పోతులూరి గురుపూజ మహోత్సవాలు



గోద ప్రతుల ఆవిష్కరణ

నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్డు బ్రహ్మంగారి గుడి వీధిలో కొలువైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవాలు ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం పాలక మండలి ప్రధాన కార్యదర్శి ఉమ్మడోజు నాగేశ్వరరావుచారి తెలిపారు. దేవస్థానం ఆవరణలో శనివారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. నాగేశ్వరరావుచారి మాట్లాడుతూ సోమవారం స్వామికి పంచామృత అభిషేకాలు, 6న పతాకావిష్కరణ, గణపతి పూజ శాంతి హోమం, 7న శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర గురుస్వాముల వారి సజీవ సమాధి నిష్ఠ వహించిన పర్వదినం సందర్భంగా పంచామృతాభిషేకాలు, పల్లకి సేవ ఉంటాయని అన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం స్వామి వారి నగర సంకీర్తన రథోత్సవ ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు, గట్టి శ్రీనివాసరావు, కుంకెపూడి కోటేశ్వరరావు, కొమ్మినేని కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు అడక శ్రీనివాస్, యాదవ్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ సిబ్బంది సేవలు అభినందనీయం



నెహ్రూనగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన విజయవంతంలో గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య కార్మికులు, అధికారులు అంకిత భావంతో పనిచేశారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ప్రధాన మంత్రి పర్యటన సందర్భంగా స్వచ్ఛ అమరావతి లక్ష్యంగా సభా ప్రాంగణంలో ప్రధాన వేదిక, వీవీఐపీ, కల్చరల్ వేదికలు, సుమారు 60 పబ్లిక్ గ్యాలరీల వద్ద ప్రధాని పర్యటన ముగిసే వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా చేయడానికి గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య, మలేరియా విభాగాల నుంచి 500 మందికి పైగా కార్మికులు నిరంతరాయంగా విధులు నిర్వహించారన్నారు. చెత్త సేకరణకు డస్ట్ బిన్లు, డంపర్ బిన్లు, కాంపాక్టర్లను అందుబాటులో ఉంచామన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో ఆరు వందల మొబైల్ టాయ్ లెట్స్‌ని అందుబాటులో ఉంచి, వాటికి నీటిని కొరత లేకుండా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు.

ఉన్నత విద్యతోనే బంగారు భవిష్యత్

వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మ చరణ్




భూపేష్‌కు ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్

కొరిటిపాడు(గుంటూరు): ప్రతి విద్యార్థి తాను అభ్యసించే విద్యపై అశ్రద్ధ వహించరాదని, ఉన్నత విద్య ద్వారానే విద్యార్థుల జీవితాలు బంగారు బాటలో నడుస్తాయని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ తెలిపారు. స్థానిక అరండల్ పేటలోని వేద సీడ్స్ కార్యాలయంలో గుడివాడలో నివసిస్తున్న భూపేష్ అనే విద్యార్థికి ఇంటర్మీడియెట్ పూర్తిచేసుకుని, తదుపరి సీఏ ఫౌండేషన్ కోచింగ్ కోసం తమ వంతుగా రూ.30 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాకూడదన్నారు. దేశ సేవలో ఎంతోమంది గొప్ప వ్యక్తులు ఉన్నారని, వారందరినీ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ స్థాయికి తగ్గట్టు పేద విద్యార్థులను ఆదరించాలని సూచించారు. భవిష్యత్‌లో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానానికి చేరుకొని పేద విద్యార్థులకు సాయం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

వీధి కుక్కల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



ఏబీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో వీధికుక్కల కుటుంబ నియంత్రణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని, నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ రోజువారీ లక్ష్యానికి అనుగుణంగా ఏబీసీ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఏటుకూరు రోడ్‌లోని జీఎంసీ ఏబీసీ సెంటర్‌ని కమిషనర్ నిఖీ చేశారు. తొలుత ఏబీసీ ఆపరేషన్ థియేటర్లు, మెడికల్ స్టోర్, సర్జరీ అనంతరం కుక్కలను ఉంచే గదులు, వాటికి ఇస్తున్న ఆహారాన్ని నేరుగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏబీసీ సెంటర్లో నిర్దేశిత ప్రమాణాలతోనే కుక్కలకు ఆపరేషన్లు జరగాలన్నారు. గత నెల 23న పునఃప్రారంభించిన ఏబీసీ సెంటర్‌లో ప్రస్తుతం ప్రతి రోజు 25 కుక్కలకు ఏబీసీ, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ జరుగుతుందని, సంఖ్యని పెంచడానికి చర్యలు తీసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు సూచించారు. సెంటర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, కుక్కలకు తగిన ఆహారం సమయానికి అందించడంలో సిబ్బంది బాధ్యతగా ఉండాలన్నారు. ఏబీసీ సెంటర్‌ని వారంలో 2, 3 సార్లు ఆకస్మిక తనిఖీలు చేస్తామని, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగర ప్రజలు కూడా వీధి కుక్కల వలన ఏమైన సమస్యలు ఎదురైతే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 08632345103 కి కాల్ చేయవచ్చని సూచించారు.

నగరంలో పోలీసుల తనిఖీలు



లక్ష్మీపురం: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డ్రంకన్ డ్రైవ్, బహిరంగ మద్యపానంపై వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ కె.అరవింద్ మాట్లాడుతూ బహిరంగ మద్యపానం చేయడం, గంజాయి వంటి మత్తు పదార్థాలు తీసుకోవడం, స్థానికులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఉంటే తక్షణమే తమకు సమాచారం తెలియజేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్ల కదలికలపై పూర్తి నిఘా ఉందన్నారు. అలాగే డ్రంకన్ డ్రైవ్ చేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వలన కుటుంబాల ఛిన్నాభిన్నం అవుతున్నాయని హెచ్చరించారు. ఆయన వెంట పట్టాభిపురం, నగరంపాలెం, అరండల్‌పేట సీఐలు గంగా వెంకటేశ్వర్లు, నజీర్‌బేగ్, ఆరోగ్యరాజు ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అభినందనీయం



విద్యార్థినికి చెక్కు పంపిణీ చేస్తున్న అద్దంకి శ్రీధర్, చిత్రంలో మేయర్ నాని, కాళహస్తి

నగరంపాలెం: ప్రతిభావంతులైన విద్యార్థులను సత్య సెక్యూరిటీ, ఇన్వెస్టిగేషన్ సంస్థ ప్రోత్సహించడం అభినందనీయమని పొగాకు బోర్డు మాజీ ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. సత్య సెక్యూరిటీలో ఉద్యోగుల పిల్లల్లో పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన ఇరవై మంది విద్యార్థులకు శనివారం బృందావన్‌గార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయ ఆవరణలో ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. సంస్థ ఎండీ కాళహస్తి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బాల్యం లోనే విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అన్నారు. దానికి అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకోవాలని పేర్కొన్నారు. తద్వారా ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. మేయర్ కోవెలమూడి నాని మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే సేవ, స్నేహ భావాలను పెంపొందించుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని అన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలన్నారు. ఆడిటర్ భార్గవి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు పేదరికం అడ్డు కానే కాదని అన్నారు. రైల్వే శాఖ ఉన్నతాధికారి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ప్రతిభను పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎరిస్ కంపెనీ జిల్లా అధినేత రత్తయ్య, విశ్రాంత లెక్చరర్ జీవీ రాయుడు, సత్య సెక్యూరిటీస్ మేనేజర్ సత్యసాయి, ఎగ్జిక్యూటివ్ లిడియా, విశ్రాంత డీఎస్పీలు సుబ్బారెడ్డి, భగీరథబాబు, కేవీ నారాయణ, మాజీ కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్ (బాబు), ముత్తినేని రాజేష్, రామినేని సుబ్బారావు పాల్గొన్నారు.

ఉద్యోగ సాధనలో రెజ్యూమ్, క్రిటికల్ థింకింగ్ కీలకం



మాట్లాడుతున్న గణేష్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ సాధనలో రెజ్యూమ్, క్రిటికల్ థింకింగ్ కీలకమైన అంశాలని కేసీ మహీంద్ర లిమిటెడ్ ఫ్రీ లాన్స్ సాఫ్ట్ స్కిల్స్ శిక్షకుడు నిడమత శ్రీసాయి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో రెజ్యూమ్ రైటింగ్–ఇంటర్వ్యూ స్కిల్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గణేష్‌కుమార్ మాట్లాడుతూ రెజ్యూమ్ తయారు చేసే విధానంతో పాటు యాక్షన్ వెర్బ్స్‌ను వాడే విధానం, క్రిటికల్ థింకింగ్, ఇంటర్వ్యూలో విజయం సాధించేందుకు అవలంబించాల్సిన పద్ధతులను వివరించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు విద్యార్థులు ప్రముఖంగా సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్లభాషపై పట్టు, సానుకూల దృక్పథం, సమయపాలన, లక్ష్యసాధన, ఆత్మ విశ్వాసం, తదితర అంశాలపై అవగాహనతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చునని వివరించారు. సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎ.ప్రత్యూష, కమ్యూనికేషన్ స్కిల్స్ విభాగాధిపతి డాక్టర్ కె.విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

లక్ష్మీపురం: నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య పిలుపునిచ్చారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మల్లయ్య లింగం భవన్ వద్ద ఏఐవైఎఫ్ ఆవిర్భవ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘం జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని యువతకు మాట ఇచ్చి ఆ మాటను గాలికి వదిలేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు అనేక హామీలు ఇచ్చి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 38వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాట ఇచ్చి ఏడాది కావస్తున్న దాని ఊసు ఎత్తలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చేటువంటి హామీను మరిచారని అన్నారు. నిరుద్యోగులకు యువతకు ఎన్నికలలో ఇచ్చినటువంటి హామీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చల్ల మరిదాసు, ఏఐఎస్ఎఫ్ నాయకులు బన్నీ, మత్తే అరుణ్, నాగరాజు, రాజేష్, నజీర్, మట్టిపల్లి కిరణ్ పాల్గొన్నారు.

కథలపై అవగాహన పెంచుకోవాలి



మహిళా బాలల గ్రంథాలయంలో కథ చెబుతున్న విద్యార్థిని

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు కథలు చెప్పడం, డ్రాయింగ్, తెలుగు పద్యాలు, తెలుగు పొడుపు కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తక పఠనం గావించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారులు బి.శకుంతల, పి.సత్యశిరీష పర్యవేక్షించారు.

■ ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో ప్రథమశ్రేణి గ్రంథ పాలకుడు షేక్ ఖయ్యూం సమ్మర్ ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా వాగ్దేవి కృష్ణ భారతదేశంలోని మ్యాప్‌లో రాష్ట్రాలను గుర్తించే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురికి సత్కారం



నగరంపాలెం: పోలీస్ శాఖ నుంచి రావాల్సిన ప్రయోజనాలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని జిల్లా ఏఎస్పీ(పరిపాలన) ఏవీ రమణమూర్తి అన్నారు. జిల్లా ఏఆర్ విభాగం ఏఎస్ఐ ఏ రాఘవరాజు, తాడేపల్లి ట్రాఫిక్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ బి.నాగేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేశారు. వీరిని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సత్కరించారు. జిల్లా ఏఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ పోలీస్ శాఖ అన్నివేళల్లో అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాసరావు, సంక్షేమ ఆర్ఐ శివరామకృష్ణ, పోలీస్ అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్, హుస్సేన్, మైలా సాంబశివరావు, కరిముల్లా పాల్గొన్నారు.